# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 8

శనివారం, మే 10, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## ఐపీఎల్ వాయిదా

### దేశం కంటే క్రికెట్ గొప్పేం కాదు

ముంబై, మే 9 : ఇండియా–పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులలో క్రికెట్ ఫ్యాన్స్ ను ఉర్రూతలూగిస్తూ వస్తున్న ఐపీఎల్ నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. ఐపీఎల్ రద్దు అవుతందని, లేదా నిరవధిక వాయిదా ఉంటుందనే ఊహాగానాల నడుమ మ్యాచ్ ల నిర్వహణపై బీసీసీఐ క్లారిటీ ఇచ్చింది. అసలు ఈ ఐపీఎల్ సీజన్ కంటిన్యూ అవుతుందా లేక పూర్తిగా రద్దవుతుందా అనే విషయంపై క్లారిటీ ఇచ్చింది బీసీసీఐ.నిరవధిక వాయిదా అంటూ వస్తున్న వార్తలపై క్లారిటీ ఇచ్చింది BCCI. ఇప్పటికిప్పుడు

- మిగతా 2వ పేజీలో





## వృద్ధురాలి ప్రేమకు ముగ్ధులైన పవన్ కళ్యాణ్

**తన విజయం కోసం మొక్కులు చెల్లించిన పోతుల పేరంటాలు తో కలసి భోజనం**

**పిఠాపురంలో పవన్ కళ్యాణ్ రి విజయం కాంక్షిస్తూ వేగులమ్మకు మొక్కిన పేరంటాలు**

**పింఛన్ సొమ్ముతో మొక్కులు చెల్లింపు**

గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విజయాన్ని కాంక్షిస్తూ వేగులమ్మ అమ్మవారికి మొక్కులు మొక్కి... తన పింఛను సొమ్ముతో మొక్కులు చెల్లించారు పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం కొత్త ఇసుకపల్లికి చెందిన వృద్ధురాలు పోతుల పేరంటాలు. పింఛను సొమ్ము దాచుకొని అమ్మవారికి రూ.27వేల విలువైన గరగ చేయించి ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ పేరంటాలు ని శుక్రవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయానికి పిలిపించుకొని ఆమెతో ముచ్చటించారు. తనపై చూపిన మమకారానికి ముగ్ధులయ్యారు. పేరంటాలు తో కలసి భోజనం చేశారు. ఆత్మీయంగా పలుకరిస్తూ స్వయంగా భోజనం వడ్డించారు. చీరను బహూకరించారు. పింఛను సొమ్ముతో మొక్కులు చెల్లించిన విషయం తెలుసుకుని ఆర్థిక సాయం అందించారు. పేరంటాలును క్యాంపు కార్యాలయంలోకి ఆత్మీయంగా ఆహ్వానించిన పవన్ కళ్యాణ్ గారు, తిరుగు ప్రయాణానికి ఏర్పాటు చేసిన వాహనం వరకు స్వయంగా వచ్చి మరీ సాగనంపారు.

# అమల్లోకి పౌర రక్షణ చట్టం



న్యూఢిల్లీ, మే 9 : పాకిస్తాన్ తో ఉద్రిక్తతలు పెరుగుతూండటంతో భారత ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా 1968 పౌర రక్షణ చట్టం మరియు నియమాల ప్రకారం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో పౌర రక్షణ చర్యలను పెంచాలని ఉత్తర్వులు జారీ చేసింది. అత్యవసర సేకరణ కోసం పౌర రక్షణ నియమాల కింద అత్యవసర అధికారాలను ఉపయోగించాలని సూచించింది. ఈ మేరకు హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ వెళ్లింది. 1968 పౌర రక్షణ నియమాలలోని సెక్షన్ 11, ఇతర అంశాలతో పాటు శత్రు దాడి జరిగినప్పుడు కీలకమైన సేవల నిర్వహణను నిర్ధారించడానికి అవసరమైన చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తుంది. 1968లో భారత పార్లమెంటు ఆమోదించిన పౌర రక్షణ చట్టం శత్రు దాడులు లేదా విపత్తుల నుండి పౌరులు, ఆస్తులు, భారత భూభాగాన్ని రక్షించడానికి అవసరమైన చర్యలను నిర్వహించడానికి అవకాశం కల్పిస్తుంది. ఈ చట్టాన్ని మే 24, 1968న ఆమోదించారు. యుద్ధం, బాహ్య దాడి, అంతర్గత అశాంతి, ఇతర శత్రు దాడుల నుండి పౌరులు, ఆస్తులు, భారత భూభాగాన్ని రక్షించడం ఈ చట్టం ఉద్దేశం. బ్లాక్అవుట్ చర్యలు, ప్రమాదకర పదార్థాల నిల్వ మరియు ఉపయోగం. వైద్య సహాయం, ఆహార సరఫరా, ఇతర అవసరమైన సేవలు , స్థానిక అధికారులను రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించడం వంటివి ఉన్నాయి. పౌర రక్షణ కార్ప్స్ ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం ఒక కంట్రోలర్ నియమిస్తుంది. దాడి సమయంలో లైట్లను నియంత్రించడం, అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి చర్యలు, జనాభాను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ఖాళీ చేయించిన వ్యక్తులకు ఆశ్రయం కల్పించడం., శిక్షణ , సన్నద్ధత కోసం అభ్యాసాలు నిర్వహిస్తారు. ఈ అభ్యాసాల సమయంలో ఆస్తి లేదా వ్యక్తులకు నష్టం జరిగితే, పరిహారం చెల్లిస్తారు. ఈ రెగ్యులేషన్లు కార్ప్స్ సభ్యుల నియామకం, శిక్షణ, విధులను నిర్దేశిస్తాయి. సైనిక బలగాలు, పోలీసు, లేదా ఇతర నిర్దిష్ట సేవలలో లేని వ్యక్తులు సాధారణంగా అర్హులు అవుతున్నారు. %ఖీశీతీఎ ూ% ద్వారా దరఖాస్తు చేయాలి. నమోదు సమయంలో ప్రమాణం చేయాలి. విధి నిర్వహణ సమయంలో గాయాలు లేదా ఆస్తి నష్టం జరిగితే, నిర్ణీత పరిహారం చెల్లించబడుతుంది. సభ్యులు కనీసం రెండు వారాల నోటీసుతో రాజీనామా చేయవచ్చు. 1960లలో భారతదేశం బాహ్య దాడుల , అంతర్గత అశాంతుల నేపథ్యంలో, పౌర రక్షణ చర్యలను బలోపేతం చేయడానికి ఈ చట్టం తెచ్చారు. 1970లలో, ఈ చట్టం పౌరులను సమీకరించడంలో విజయవంతమయింది. కార్ప్స్ సభ్యులకు విధి సమయంలో గాయాలు లేదా నష్టం జరిగితే, నిర్దిష్ట నిబంధనల ప్రకారం పరిహారం ఇస్తారు. అయితే చట్ట ఉల్లంఘనకు 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.




## పాకిస్తాన్ కాల్పుల్లో అమరుడైన తెలుగు జవాన్ మురళీ నాయక్

శ్రీనగర్, మే 9: జమ్మూకశ్మీర్‌లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో తెలుగు జవాన్ మురళీ నాయక్ అమరుడయ్యారు. వీర జవాన్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండా. మే 10 శనివారం వీరజవాన్ పార్థివదేహం స్వగ్రామానికి చేరుకోనుంది. దేశ రక్షణలో శ్రీ సత్యసాయి జిల్లా, పెనుకొండ శాసనసభ నియోజకవర్గం, గోరంట్ల మండలానికి చెందిన మురళి నాయక్ అనే సైనికుడు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళి నాయక్ కు నివాళులు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా కేవలం ఉగ్రవాద స్థావరాలపై మాత్రమే దాడి చేశారు..పాక్ సైనికులకు కానీ, పాక్ పౌరులపై కానీ ఎలాంటి దాడి చేయలేదు. ఉగ్రవాదులకు తమకు సంబంధం లేదన్న పాకిస్తాన్ వక్రబుద్ధిని బయటపెట్టింది. ఉగ్రమూకపై భారత్ దాడి చేస్తే...తిరిగి వంకరబుద్ధి చూపిస్తూ భారత సరిహద్దు ప్రాంతాలపై క్షిపణి, డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్‌లో పాక్ జరిపిన దాడుల్లో తెలుగు జవాన్ వీర మరణం పొందారు. మృతిచెందిన జవాన్‌ను సత్యసాయి జిల్లాకు చెందిన మురళీ నాయక్‌గా గుర్తించారు. మే 08 గురువారం రాత్రి సరిహద్దు వెంబడి పాక్ కాల్పులు జరపగా మన సైన్యం కూడా దీటుగానే బదులిచ్చింది. ఈ ఎదురుకాల్పుల్లో మురళీ నాయక్

- మిగతా 2వ పేజీలో

## 6 ప్రాంతాల్లో 400 డ్రోన్లతో పాక్ దుశ్చర్య – భారత్


భారత్‌లోని సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని గురువారం రాత్రి పాకిస్థాన్ డ్రోన్ దాడులకు తెగబడిన సంగతి తెలిసిందే. జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లోని 36 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని 300 నుంచి 400 డ్రోన్లతో పాక్ ఈ దాడులకు పాల్పడినట్లు భారత సైన్యం తెలిపింది. పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా ఉపయోగిస్తోందని వెల్లడించింది.

ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచార సేకరణే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని తెలిపారు. ప్రాథమిక నివేదికల ప్రకారం తుర్కియేకు చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' డ్రోన్లను ప్రయోగించినట్లు



తెలిసిందన్నారు. "గురువారం రాత్రి రెచ్చగొట్టే చర్యలకు దిగిన పాకిస్థాన్.. నియంత్రణ రేఖ వెంట ఉల్లంఘనకు పాల్పడుతూ దాడులకు తెగబడింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. పాకిస్థాన్ నుంచి 300 నుంచి 400 డ్రోన్ల వరకు వచ్చాయి. వీటిలో అనేక డ్రోన్లను కూల్చేశాం. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నాం. ఈ దాడుల్లో అనేకమంది గాయపడ్డారు. పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుంది. ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా పాక్ దాడులు చేస్తోంది.

- మిగతా 2వ పేజీలో



## మిస్ వరల్డ్ పోటీలు... అంతా సిద్ధం

### నేడు హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల ప్రారంభం
### ఈ నెల 31 వరకు రాష్ట్రంలో సుందరీమణుల సందడి

హైదరాబాద్, మే 9 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రపంచ సుందరి పోటీలకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. మే 09 శనివారం సాయంత్రం గచ్చిబౌలి స్టేడియంలో వైభవంగా ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. మిస్ వరల్డ్ సంస్థతో కలిసి తెలంగాణ ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. విదేశీ ప్రసార మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించడంతో రాష్ట్ర ఖ్యాతిని మరింత పెంచే ప్రయత్నం చేస్తోంది. ప్రపంచ దేశాల సుందరీమణులతో పాటు అంతర్జాతీయ మీడియా ఫోకస్ కూడా ఇక్కడ ఉండడంతో భాగ్యనగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దారు అధికారులు.మిల్ వరల్డ్ పోటీల నిర్వహణద్వారా రాష్ట్ర ప్రతిష్టను పెంచడంతో పాటూ పెట్టుబడుల ఆకర్షణకు అందాల పోటీలు వినియోగించుకోవాలని భావిస్తోంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. అందుకే వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతో పెట్టుబడుల సాధన, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని భావిస్తోంది.మే 10 నుంచి 31 వరకు ఈవెంట్ కొనసాగుతుంది. వివిధ దేశాల నుంచి వచ్చే అతిథులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని.. ఇప్పటికే 80శాతానికి పైగా అతిథులు, పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నారని సైబరాబాద్ జాయింట్ గజారావ్ భూపాల్ వెల్లడించారు. వారికి కేటాయించిన హెూటల్స్ దగ్గర కూడా భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అతిథులు ఉండే పరిసరాలను రెడ్ జోన్, గ్రీన్ జోన్‌గా పెట్టామన్నారు. అనుమతి లేకుండా ఎవరికి లోపలకు అనుమతి ఉండదని, తెలంగాణలో చాలా ప్రదేశాలను ప్రత్యేక అతిథులు సందర్శిస్తారని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల కోసం ఎలాంటి ట్రాఫిక్ డైవర్షన్లు ఉండవని స్పష్టం చేశారు. CM , గవర్నర్, మంత్రులు, VIP, VVIPలకు ప్రోటోకాల్ ఉంటుందని తెలిపారు. ఇతర జిల్లాల నుంచి కూడా ప్రత్యేక ఫోర్స్ తప్పించామని తెలిపారు. మే 31న జరగనున్న మిస్ వరల్డ్ ఫైనల్స్ కి సంబంధించి కూడా భద్రతా పరమైన చర్యలు చేపట్టామని

- మిగతా 2వ పేజీలో

## తెలంగాణను చైనా ప్లస్‌గా తీర్చిదిద్దుతున్నాం

**విధానాల రూపకల్పన, అమలులో వేగంగా పనిచేస్తున్నాం**

**రాష్ట్రాన్ని ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం**

**ఈ మేరకు దక్షిణాదికి ఊతమిచ్చేలా లోక్‌సభలో స్థానాలుండాలి**

**'ది హిందూ' సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్: "అమెరికా, చైనాల మధ్య పన్నుల యుద్ధాన్ని మనం చూస్తున్నాం. ఈ సమయంలో తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా అన్ని రకాల ఉత్పత్తులను ఇక్కడే తయారయ్యేలా ప్రణాళికలు రూపొందించాం. చైనా ప్లస్‌గా తెలంగాణను తీర్చిదిద్దాలన్నదే మా లక్ష్యం. ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఇతర పరిశ్రమల స్థాపనకు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం. విధానాల రూపకల్పన, అమలులో టీ20 మోడల్‌లో పనిచేస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'ది హిందూ' పత్రిక బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో శుక్రవారం ఆయన జూమ్ మాధ్యమం ద్వారా పాల్గొని మాట్లాడారు. "దావోస్ వేదికగా తెలంగాణకు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. ఏపీలోని మచిలీపట్నం

- మిగతా 2వ పేజీలో



## అర్హులైన జర్నలిస్టులకు త్వరలో ఇందిరమ్మ ఇళ్లు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నాంపల్లి: అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలైన విలేకరులు, వృత్తి నిర్వహణలో చనిపోయిన వారి కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న వారిని ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. విధి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలవారీ పెన్షన్‌బీ అనారోగ్యం, ప్రమాదాలకు

- మిగతా 2వ పేజీలో

వాయిస్ టుడే
హైదరాబాద్
శనివారం, 10 మే 2025

# మిస్ వరల్డ్ పోటీలు... అంతా సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)



CP గజారావ్ భూపాల్ పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే 100 మందికి పైగా సుందరీమణులు హైదరాబాద్ చేరుకున్నారు. మిస్ వరల్డ్ లిమిటెడ్‌కు చెందిన ప్రతినిధులు, సహాయకులు ఇప్పటికే వచ్చేశారు. రానున్న రెండు రోజుల్లో వివిధ దేశాల నుంచి మరింతమంది ప్రతినిధులు నగరానికి రానున్నారు. పోటీలకోసం సిద్ధమైన గచ్చిబౌలి స్టేడియంలో గురువారం రిహార్సల్స్ ఉత్సాహంగా సాగాయ్. నగరంలో వివిధ ప్రాంతాల్లో జరిగే ఈ వేడుకలను వీక్షించే అవకాశం సామాన్యులకు కల్పిస్తోంది ప్రభుత్వం. ఈ మేరకు టూరిజం వెబ్‌సైట్ https://tourism.telangana.gov.in/events&single/miss& world& event లో రిజిస్టర్ చేసుకోవచ్చని సూచించింది. పోటీల జరిగే ఒక్కో కేంద్రంలో వెయ్యి మంది సామాన్యులు వీక్షించేందుకు అవకాశం కల్పిస్తున్నారు మరోవైపు వివిధ దేశాలకు చెందిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ మే16న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం పిల్లల మర్రిని సందర్శించనున్నారు. ఈమేరకు జిల్లా పిల్లల మర్రిలో అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. 750 సంవత్సరాల చరిత్రఉన్న పిల్లల మర్రి చెట్టు, పురావస్తు మ్యూజియం, రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని అందగత్తెలు సందర్శించనున్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు త్వరలో ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

గుర్రై అచేతన స్థితిలో ఉన్న వారికి మంత్రి శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని మీడియా అకాడమీ కార్యాలయంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన తెలంగాణ మీడియా అకాడమీ భవనానికి మరమ్మతులు పూర్తిచేసి ఈ నెలాఖర్లోగా ప్రారంభిస్తామని చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికి విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి దానిపై వచ్చే వడ్డీని వారి సంక్షేమానికి అకాడమీ ఖర్చుపెడుతుందన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ.1 లక్ష ఆర్థిక సహాయంతోపాటు 5 ఏళ్ల వరకూ నెలకు రూ.3వేల చొప్పున పెన్షన్ అందజేస్తున్నామని చెప్పారు. వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల కింద 1 నుంచి 10వ వరకు చదివే వారికి నెలకు రూ.1000 చొప్పున గరిష్ఠంగా ఇద్దరికి అందిస్తున్నామన్నారు. మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి నిధులు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, పలువురు పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# 6 ప్రాంతాల్లో 400 డ్రోన్లతో పాక్ దుశ్చర్య - భారత్

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాక్ ప్రయత్నిస్తోంది. పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు మొదలుపెట్టినప్పటికీ.. అక్కడి పౌర విమానాలకు గగనతలాన్ని మూసివేయలేదు. కరాచీ, లాహోర్ మధ్య విమాన సర్వీసులు నడుస్తూనే ఉన్నాయి. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన ఉంటుందని తెలిసీ.. పౌర విమానాలను పాకిస్థాన్ రక్షణ కవచంగా వాడుకుంటోంది. ఇది భారత్-పాక్ మధ్య అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో వెళ్లే విమానాలతోపాటు అక్కడి పౌర విమానాలకు సురక్షితం కాదు. అంతర్జాతీయ విమానాలను దృష్టిలో ఉంచుకొని భారత వాయుసేన పూర్తి సంయమనంగా వ్యవహరించింది" అని రక్షణశాఖ ప్రతినిధులు కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు వెల్లడించారు.

# ఐపీఎల్ వాయిదా

(మొదటి పేజీ తరువాయి)




ఒకే ఒక్క వారం రోజులు మాత్రం మ్యాచులు నిలిపివేస్తున్నామని.. వారం రోజుల తర్వాత అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. దేశం కంటే.. మన దేశ సైనికుల కంటే క్రికెట్ గొప్పది కాదంటూ కూడా స్పష్టం చేసింది బీసీసీఐ. గురువారం (మే 8) అర్థంతరంగా ధర్మశాలలో పంజాబ్ - ఢిల్లీ మ్యాచ్ ను వాయిదా చేసిన బీసీసీఐ చర్చోపచర్చల తర్వాత ఐపీఎల్ పై శుక్రవారం (మే 9) క్లారిటీ ఇచ్చింది. %టాటా% 2025 ను వారం రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఇవాళ (శుక్రవారం మే 9) జరగాల్సిన లక్నో - బెంగళూరు మ్యాచ్ వాయిదా పడింది. "టాటా ఐపీఎల్ 2025 షెడ్యూల్ ను వారం రోజుల పాటువాయిదా వేస్తున్నట్లు బీసీసీఐ నిర్ణయం తీసుకుంది" అని సెక్రెటరీ దేవజిత్ సైకియా ప్రకటించారు. తదుపరి షెడ్యూల్ ను ఇండియా-పాక్ మధ్య ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఉద్రిక్తతలు తగ్గటం లేదా దీనిపై పూర్తి క్లారిటీ వచ్చిన తర్వాత షెడ్యూల్ ప్రకటిస్తామని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్రికెట్ కంటే దేశమే ముఖ్యమని, ప్రభుత్వానికి, సైనికులకు సంపూర్ణ మద్ధతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్ లో ప్రాణాలకు తెగించి పోరాడిన సైనికుల పక్షాన బీసీసీ నిలుస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. క్రికెట్ దేశ ప్రజల ప్యాషన్ అయినప్పటికీ.. దేశ భద్రత, ప్రయోజనాలతో పోల్చినప్పుడు దేశమే ముఖ్యమని పేర్కొన్నారు. బీసీసీఐ నిర్ణయాన్ని అర్థం చేసుకుని సహకరిస్తున్న బ్రాడ్ కాస్టర్ జియో స్టార్ కు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా టైటిల్ స్పాన్సర్ టాటాతో పాటు అసోసియేట్ స్పాన్సర్స్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# పాకిస్తాన్ కాల్పుల్లో అమరుడైన తెలుగు జవాన్ మురళీ నాయక్

(మొదటి పేజీ తరువాయి)

చనిపోయినట్టు సమాచారం. మే 10 శనివారం స్వగ్రామానికి వీర జవాన్ పార్థివ దేహం రానుంది. వీర జవాన్ మురళీ నాయక్ సోమందేపల్లి మండలం నాగినాయని చెరువుతండాలో పెరిగారు. సోమందేపల్లి విజ్ఞాన్ స్కూల్‌లో విద్యాభ్యాసం సాగింది. వీర జవాన్ మృతితో ఆయన కుటుంబం శోకసంద్రంలో ఉంది. యుద్ధభూమిలో కన్నుమూసిన మురళీనాయక్ శ్రీరాం నాయక్, జ్యోతీ బాయిల ఏకైక సంతానం

**14 మందిని చంపాడు:** మురళీ నాయక్ తండ్రి శ్రీరాం నాయక్ కొన్ని కీలక విషయాలను చెప్పారు. తన కుమారుడు చనిపోయేముందు పాకిస్థాన్ శత్రువులు దేశంలోకి అడుగుపెట్టకుండా అడ్డుకుని వీరమరణం పొందాడని తెలిపారు. 14మంది శత్రవుల్ని కాల్చి చంపినట్లు స్థానికులతో కలిసి వివరించారు. ఆయన మాటల్లోనే.. 'మురళీ నాయక్ రెండేళ్ల క్రితం ఉద్యోగంలో చేరాడు.. 2022 నవంబర్ 8న అగ్నివీర్ రిక్రూర్ట్‌మెంట్‌లో సెలక్ట్ అయ్యాక ఉద్యోగంలో చేరాడు.. నాలుగేళ్లు అగ్రిమెంట్ ఉంది.. మురళీనాయక్ 2026 నవంబర్‌లో ముగిసేది. ఇవాళ ఆర్మీవాళ్లు నా భార్యకు ఫోన్ చేశారు.. ఆమెకు హిందీ అర్థం కాలేదు. అప్పుడు మురళీ గురించి మాట్లాడుతున్నారని నాకు ఫోన్ తీసుకొచ్చి ఇచ్చింది. రాత్రి ఫైరింగ్ జరిగింది.. మురళీనాయక్ చనిపోయారని నాతో చెప్పారు. కాల్పుల జరిగిన సమయంలో 14మందిని మురళీనాయక్ చంపాడని.. వాళ్లను ఎటాక్ చేసిన తర్వాత వెనక్కు తిరిగి వస్తున్నసమయంలో మురళీని



ఎటాక్ చేశారనో నాతో ఆర్మీ వాళ్లు అన్నారు. ఇటీవల మురళీనాయక్‌ను ఆర్మీ పంజాబ్ నుంచి జమ్మూ కాశ్మీర్‌కు తీసుకెళ్లింది' అని వివరించారు. 14మంది శత్రువుల్ని మట్టుబెట్టిన తర్వాత అక్కడ ఎవరూ లేరనుకుని వెనుదిరిగిన సమయంలో ఇదంతా జరిగిందని చెబుతున్నారు. మురళీ నాయక్ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మురళీ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్రీ మురళీ నాయక్ వీర మరణాన్ని జాతి మరచిపోదన్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. 'ఆపరేషన్ సిందూర్ లో వీర మరణం పొందిన జవాన్ శ్రీ మురళీ నాయక్ గారి త్యాగాన్ని భారత జాతి ఎన్నడూ మరచిపోదు. జమ్ము కశ్మీర్ సరిహద్దుల్లో శత్రు మూకలతో పోరాడి వీర మరణం పొందిన భారత జవాన్ శ్రీ మురళీ నాయక్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. శ్రీ సత్యసాయి జిల్లా కల్లి తండాకు చెందిన ఈ యువ జవాన్ దేశ రక్షణకు అంకితమై, సమర భూమిలో అమరులయ్యారు. ఈ వీరుడి తల్లితండ్రులు శ్రీమతి జ్యోతి బాయి గారికి, శ్రీ శ్రీరామ్ నాయక్ గారికి, ఇతర కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వ అన్ని విధాలా ఆ కుటుంబానికి భరోసా ఇస్తుంది' అని ప్రకటన విడుదల చేశారు. మురళీ నాయక్ తల్లిదండ్రులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు. దేశ రక్షణలో పెనుకొండ నియోజకవర్గం, గోరంట్ల మండలం, కల్లితండాకు చెందిన మురళినాయక్ ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మురళీనాయక్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరాం నాయక్‌లతో ఫోన్‌లో మాట్లాడి సీఎం వారిని పరామర్శించారు. మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన మురళీ త్యాగాన్ని దేశమంతా గుర్తుపెట్టుకుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. 25 ఏళ్ల వయసులోనే దేశం కోసం అమరుడైన మురళీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం తెలిపారు. వీరజవాన్ మురళీ తల్లిదండ్రుల ఆవేదన తీర్చలేనిది అయినా.. ధైర్యంగా ఉండాలని ముఖ్యమంత్రి వారిని కోరారు.

# తెలంగాణను చైనా ప్లస్‌గా తీర్చిదిద్దుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

నుంచి తెలంగాణకు రహదారి నిర్మాణం ద్వారా డ్రైపోర్టుకు శ్రీకారం చుడుతున్నాం. నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీని నిర్మించనున్నాం. గుజరాత్ మోడల్‌కు కాలం చెల్లింది. అది నరేంద్రమోదీ మోడల్ వాట్సప్ యూనివర్సిటీ. అందులో ప్రచారానికే పెద్దపీట వేస్తారు. పనులు చేసి అభివృద్ధిని కళ్ల ముందు నిలపడమే మా మోడల్. కేంద్రం కూడా దీన్ని అనుసరించాల్సిందే. గత ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు తెలంగాణ అభివృద్ధికి తమవంతు కృషిచేశారు. ఇప్పుడు నా వంతుగా ప్రయత్నిస్తున్నా. తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధిని సాధించాలన్నది మా ప్రభుత్వ లక్ష్యం.

### లోక్‌సభలో దక్షిణాది ప్రాతినిధ్యాన్ని తగ్గించాలని కుట్ర

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తే తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాలన్నీ తీవ్రంగా నష్టపోతాయి. ఇప్పుడున్న సీట్ల నిష్పత్తి ప్రాతిపదికన చేసినా మాకు నష్టమే. లోక్‌సభలో దక్షిణాది ప్రాతినిధ్యాన్ని కనిష్ఠానికి తగ్గించాలని కేంద్రం చూస్తోంది. ఒక వ్యక్తి, ఒక పార్టీ శాశ్వతంగా దేశాన్ని పాలించాలన్నది వారి ఆలోచన. దేశ ఆర్థిక వ్యవస్థకు ఏ రాష్ట్రమైతే ఊతమిస్తుందో... ఆ స్థాయిలో దానికి సీట్లను కేటాయించాలి. ఆ లెక్కన దక్షిణాదికి 33% సీట్లను ప్రత్యేకించాలి. అప్పుడే లోక్‌సభలో మా గళం వినిపిస్తుంది. కేసీఆర్ నేతృత్వంలోని భారాస పార్టీ కూడా ఇదే ఆలోచనతో చెన్నై సమావేశానికి హాజరైంది. ముందుగా అన్ని రాజకీయ పార్టీలను ఈ అంశంపై కేంద్రం చర్చకు పిలిచి, ఏ ప్రాతిపదికన నియోజకవర్గ పునర్విభజన చేస్తారనేది చర్చించాలి.

### సామాజిక దృక్కోణాన్ని ఆవిష్కరించే గణన

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే... కులగణన చేపడతామని రాహుల్‌గాంధీ పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చారు. అందుకే తెలంగాణలో కులగణన చేపట్టాం. నిజానికి మేం చేసింది... సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, కుల సర్వే. సామాజిక దృక్కోణాన్ని ఆవిష్కరించడానికి ఇది దోహదపడుతుంది. అగ్రవర్గాల్లోని పేదలకు ఈడబ్ల్యూఎస్ కోటా వర్తింపజేయడానికి సైతం ఉపయోగపడుతుంది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రోజే తెలంగాణలోనే తొలుత అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించాం. ఈ మేరకు కసరత్తు చేసి శాసనసభలో బిల్లును ఆమోదించాం.

### ఒకే గొడుగు కిందకు విద్య

గ్రామీణం నుంచి వచ్చిన నాకు కులం ప్రభావం ఏమిటో బాగా తెలుసు. అందుకే అన్ని కులాలకు సమానమైన విద్యావకాశాలు కల్పించాలనే సంకల్పంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులందరికీ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లలో విద్యను అందించనున్నాం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో రూ.250 కోట్ల వ్యయంతో ఒకటి నెలకొల్పనున్నాం. కేంద్ర ప్రభుత్వం ఈ తరహా విప్లవాత్మక చర్యలకు ముందుకు రావాలి.

### దేశానికే ఆదర్శంగా సంక్షేమ పథకాలు

ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త, ఒక ఉద్యోగి వస్తే ఆ కుటుంబ స్థితిగతులు మారతాయనే ఆలోచనతో తెలంగాణలో అమలుచేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. మేం 25,35,364 మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. ఏడాదికి రూ.12 వేల రైతుభరోసా ఇస్తున్నాం. రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తున్నాం. 24 గంటల విద్యుత్‌ను అందిస్తున్నాం. తద్వారా దేశంలోనే అత్యధిక వరి ఉత్పత్తి ఈ ఏడాది సాధ్యమైంది. స్వయం సహాయ సంఘాలకు సౌర విద్యుత్ ప్రాజెక్టులు అప్పగించాం. వారికి వెయ్యి ఆర్టీసీ అద్దె బస్సులనిచ్చాం. నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడానికి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని స్థాపించాం" అని వివరించారు.




# రంగంలోకి టెరిటోరియల్ ఆర్మీ

న్యూఢిల్లీ మే 9 : పహల్గామ్ ఉగ్రదాడి.. దానికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ భద్రతను మరింత పటిష్టం చేసేందుకు, సాధారణ సైన్యానికి సహాయం అందించేందుకు టెరిటోరియల్ ఆర్మీని రంగంలోకి దించేందుకు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదికి విస్తృత అధికారాలను కల్పిస్తూ.. రక్షణ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. టెరిటోరియల్ ఆర్మీ రూల్స్ 1948లోని రూల్ 33 ప్రకారం రక్షణ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త అధికారాల ద్వారా ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది.. టెరిటోరియల్ ఆర్మీలోని అధికారులను, సిబ్బందిని అత్యవసర భద్రతా విధుల కోసం లేదా సాధారణ సైన్యం కార్యకలాపాలకు మద్దతుగా ఉపయోగించవచ్చు. రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం, టెరిటోరియల్ ఆర్మీ రూల్ అధికారాలను వినియోగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం టెరిటోరియల్ ఆర్మీలోని ప్రతి అధికారిని అవసరమైన కాపలా కోసం లేదా సాధారణ సైన్యానికి మద్దతుగా లేదా అనుబంధంగా ఉండేందుకు పిలిచే అధికారాన్ని ఆర్మీ చీఫ్‌కు మంజూరు చేస్తోందని స్పష్టం చేసింది.

# రేవంత్ రెడ్డి లాంటి దివాళా కోరు మాటలు ఏవరూ మాట్లాడలేదు

## భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



ఖమ్మం : ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో స్వర్గీయ డిసీఎంఎస్ మాజీ ఛైర్మన్ రాయల శేషగిరిరావు విగ్రహన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆవిష్కరించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్రెడ్డి, రేగా కాంతారావు , వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ నాయక్, కొండబాల కోటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, మదన్ లాల్, జడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజు హాజరయ్యారు. తల్లాడ మండలంలోని మిట్టపల్లి లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్టలాడారు. కీ శే రాయల శేషగిరిరావు విగ్రహ ఆవిష్కరణ కు నన్ను ఆహ్వానించినందుకు ధన్యవాదాలు. ధాన్యం కొనుగోలు జరగడం లేదు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు. 17 నెలల్లో జిల్లాకు ఏం జరిగిందో ప్రజలు ఆలోచన చేయాలి. కేసీఆర్ ప్రజల కోసం సీతారామా ప్రాజెక్ట్ తెస్తే ఆ నీళ్ళు నెత్తిన జల్లుకునారు కానీ ప్రజలకు ఏమి చేయలేదు. ఉప ముఖ్యమంత్రి భట్టి అఫిడవిట్, నోట్ లు అబద్ధపు హామీలు అన్ని ఇచ్చాడు. తప్పకుండా ఇచ్చిన హామీని 100 రోజుల్లో చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. కేసీఆర్ కిట్ అనే పథకం అద్భుతమైన పథకం. కాంగ్రెస్ వచ్చాక ఆ పథకం ఎత్తేశారని అన్నారు.

రైతు బంధు గురించి ఆనాడు రెండు పంటలకు ఇస్తావా? అని అడిగిన రేవంత్ నేడు ఒక్క పంటకి కూడా ఇవ్వడం లేదు. రైతు రుణమాఫీ లేదు, షాది ముబారక్ లేదు. వాళ్ళు చెప్పిన ఏ హామీ అయినా నెరవేర్చరా? మార్పు బాగుందా? మార్పు కావాలని జిల్లా మొత్తం కాంగ్రెస్ కి ఓటేశారు. కాంగ్రెస్ ను నమ్మి మంచి మంచి నాయకులను ఓడగొట్టారు. 10 ఏళ్ల పాలన చేసిన కేసీఆర్ ను కాదన కాంగ్రెస్ విసిరిన ఆనందమైన వలలో చిక్కుకున్నారు. 6 గ్యారెంటీలు కాకుండా 420 హామీలు ఇచ్చారు. నేను చాలా మంది ముఖ్యమంత్రులను చూసా. ఎవరూ కూడా రేవంత్ రెడ్డి లాంటి దివాళా కోరు మాటలు మాట్లాడలేదు. ఢిల్లీకి పోతే దొంగలాగా చూస్తున్నారంటున్నా రేవంత్.. దొంగను దొంగాలగే చూస్తారు కదా. ఢిల్లీ లో అపాయింట్మెంట్ కూడా ఇవ్వడం లేదు. అపాయింట్మెంట్ ఇస్తే చెప్పులు ఎత్తుకుపోతాడని అంటున్నారు. జూన్ జులై లో స్థానిక సంస్థల ఎన్నికలు పెడతారని తెలుస్తుంది. ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి ప్రజల్లో ఉండాలి. ఉప ఎన్నిక లో బి ఆర్ ఎస్ సత్తా ఏంటో చాటాలి. ఢిల్లీ పార్టీలను నమ్మొద్దు అని కేసీఆర్ చిలక్కి చెప్పినట్టు చెప్పారు. ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా మీకోసం పోరాడేది బి ఆర్ ఎస్ మాత్రమే. రాబోయే రోజుల్లో మన ఇంటి పార్టీ మన తెలంగాణ పార్టీని ఆశీర్వదించాలని అన్నారు.

# మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి: సిఐటియు

**కార్మికుల కడుపుమంట, ఎంత ఆక్రోసించిన పట్టని మున్సిపల్ ఉన్నతాధికారులు**

**మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాల చెల్లింపు బాధ్యత ప్రభుత్వమేవహించాలి!**

**రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లింపులో మున్సిపల్ ఉన్నతాధికారుల వివక్ష!!**

**సిఐటియు జిల్లా నాయకులు ఎం. చంద్రశేఖర్**



కుత్బుల్లాపూర్ మే 9(వాయిస్ టుడే): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల మార్చి నెల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ప్రగతి నగర్ లోని నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ఏప్రిల్ మాసంలో 28వ తేదీ పెండింగ్ వేతనాలపై మున్సిపల్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించడం జరిగింది. ఆ సందర్భంగా కమిషనర్ ప్రమేయంతో మేనేజర్ పవన్ కుమార్ ధర్నాను ఉద్దేశించి పెండింగ్ వేతనాలు మే రెండవ తేదీ మార్చి ఏప్రిల్ 2 మాసాల వేతనాలు చెల్లిస్తామని వాగ్దానం చేశారన్నారు. ధర్నా అనంతరం మేనేజర్ చర్చించినప్పుడు ట్రెజరీకి పంపిన మార్చి నెల చెక్కు ప్రభుత్వం వద్ద పెండింగ్ ఉన్నదని ఫైనాన్స్ డిపార్ట్మెంట్లో అప్రూవల్ అయిన తర్వాతనే వేతనం వస్తుందని చెప్తున్నార న్నారు. ధర్నా రోజు చెక్కు క్యాన్సిల్ చేసి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కనీసం ఏప్రిల్ నెల వేతనం కూడా పూర్తిగా కార్మికులందరికీ అందలేదు. ఈ విషయమై మేనేజర్ స్పందిస్తూ హెచ్డిఎఫ్సి బ్యాంకులో మున్సిపల్ నిధులు ఉన్నప్పటికీ బ్యాంకు అధికారులు కార్మికులకు జమ చేయడంలో ఆలస్యం అవుతుందన్నారు. ఈ విషయమై వెంటనే ప్రభుత్వ బ్యాంకుకు నిధులు మల్లించాలని యూనియన్ గా కోరడమైనది. ఇది ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయం మా పరిధిలో లేదని చెప్పారన్నారు. కార్మికుల గ్రూపులకు సంబంధించి అకౌంట్స్ను యాక్సిస్ బ్యాంకుకు మార్చి ప్రతినెల 1వ తేదీన వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మార్చి నెల వేతనం చెల్లింపులు మేము చేయగలిగినది ఏమీ లేదని మేనేజర్ పవన్ కుమార్ వెల్లడించడమైనది. కావున వెంటనే ప్రభుత్వం, ఉన్నతాధికారులు పెండింగ్ వేతనాల విషయమై సమస్యను పరిష్కరించి కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఫైనాన్స్ లోని ఉన్నతాధికారులు కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికుల చెక్కులను మాత్రమే అప్రూవల్ చేయకుండా వేతనాలు సమయానికి చెల్లించకుండా ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులందరూ ఎక్కువ మంది ఎస్సీ ఎస్టీ సామాజిక తరగతులకు సంబంధించిన వారిని గుర్తు చేశారు. కావున వెంటనే కార్మికుల కడుపు మంట ఆక్రోసాన్ని గుర్తించి ప్రభుత్వమే బాధ్యత వహించి మున్సిపల్ అధికారులు వెంటనే కార్మికుల వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సిఐటీయూగా డిమాండ్ చేస్తున్నామన్నారు. పెండింగ్ వేతనాలు విషయమై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్మికులందరూ ఐక్యమై పోరాడుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నాగశేషు చిన్న నరసింహ మహిపాల్ నాగయ్య నరసింహ శీను అలివేలు మనీ లక్ష్మీ నరసమ్మ మరియు తదితర మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



**ప్రముఖ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కాప్రా మున్సిపల్ మాజీ చైర్మన్, ఉప్పల్ శాసనసభ నియోజకవర్గ తొలి శాసనసభ్యుడు,టిటిడి బోర్డు మాజీ సభ్యుడు ,సంఘ సేవకుడు ,నిగర్వి ,విలువలకు ప్రాధాన్యత ఇచ్చే రాజకీయ నాయకుడు బండారి రాజిరెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్,మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు,మాజీ మంత్రి దయాకర్ రావు,మాజీ కార్పొరేషన్ చైర్మెన్ ఎరోళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.** - ఉప్పల్ ( వాయిస్ టుడే ప్రతినిధి)

## చేవెళ్ల మండలంలో బడి బాట సందడి

### తంగడపల్లి పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం




చేవెళ్ల..మే 9(వాయిస్ టుడే) రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు మళ్లీ తెరుచుకోనున్న సందర్భంగా చేవెళ్ల మండలంలోని తంగడపల్లి ప్రాథమిక పాఠశాలలో బడి బాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించగా, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. వేసవి సెలవులు ముగిసిన తరువాత పిల్లలు కొత్త ఆశలతో, కొత్త పుస్తకాలతో పాఠశాల బాట పట్టాలని అన్నారు. విద్యార్థులలో చదువుపై ఆసక్తి పెంపొందించడమే తమలక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులతో ఊరు పేరును మరియు పాఠశాల పేరును ప్రజలు చెప్పుకునేలా నిలబెడుతున్నారు. ప్రైవేటు పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేసి కూడా సరైన విద్య బోధన చేయడం లేదు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అందించే నాణ్యమైన ఆహారం మంచి విద్య పిల్లలకు రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తును నిర్మిస్తుందని తెలిపారు. బడి బాట ద్వారా ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల హాజరు పెంపొందించడమే తమ లక్ష్యమని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు.

## హరిహరసుతాన్ అయ్యప్ప స్వామి ఆలయంలో విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన

### ముఖ్య అతిథిగా కాంగ్రెస్ ఇంచార్జ్ హన్మంత్ రెడ్డి పాల్గొనడంతో భక్తుల ఉత్సాహం



కుత్బుల్లాపూర్ మే 9(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 128 డివిజన్ భగత్ సింగ్ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ హరిహరసుతాన్ అయ్యప్ప స్వామి ఆలయం మరియు విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన మహోత్సవానికి శ్రీ ధర్మ శ్రాస్త సేవ సమితి వారి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా లికుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని స్వామి వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించి నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడు సుఖ: సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు . ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ టి. లక్ష్మ రెడ్డి, భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొండల శ్రీనాథ్ రావు, ప్రధాన కార్యదర్శి సత్యం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బల్ రెడ్డి మరియు కాలనీ వాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## చందానగర్ సెంట్రో షాపింగ్ కాంప్లెక్‌లో అగ్నిప్రమాదం

శేరిలింగంపల్లి,మే 9( వాయిస్ టుడే): చందానగర్ గంగారం లోని సెంట్రో షాపింగ్ కాంప్లెక్ లో శుక్రవారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. సెంట్రో నేమ్ బోర్డులో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది.ఏడాది క్రితం ఇదే షాపింగ్ కాంప్లెక్స్ లో మంటలు చెలరేగి భారీగా ఆస్తి నష్టం జరిగింది. షాపింగ్ కాంప్లెక్స్ ను యాజమాన్యంఇటీవలే రెనోవేషన్ చేసి విక్రయాలు ప్రారంబించింది. పైన నేమ్ బోర్డులో చెలరేగిన మంటలు కింది వరకు వ్యాపించి భారీగా మంటలు ఎగిసిపడ్డాయి .దీంతోపాటు పక్కనే ఉన్న ఆర్కే కలెక్షన్స్ రెండో బిల్డింగ్ వరకు మంటలు వ్యాపించాయి. దీంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రెండు ఫైర్ ఇంజన్లతో మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన నష్టం వివరాలు తెలియాల్సి ఉన్నది.

## యాదాద్రి కొండపైన నృసింహ జయంతి మహోత్సవాలు









వాయిస్ టుడే/యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానములో సింహ జయంతి మహోత్సవాలు మూడు రోజులపాటు అత్యంత వైభవంగా ప్రభావం కాను న్న ఇందులో ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు గరుడ వాహనం పైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సేవా నిర్వహించారు. స్వామివారి జయంతి మహోత్సవాల సందర్భంగా ధార్మిక సాహిత్య సంగీత మహాసభలను కూడా ఏర్పాటు చేశరూ ఆలయ ఈవో వెంకట్రావు . జిల్లా కలెక్టర్ చైర్మన్ ప్రధాన అర్చకులు టెంపుల్ సిబ్బంది. స్వామివారి సేవ అంగరంగ వైభవం జరుపుకున్నారు.



## ఏఆర్ జవాన్ తిక్క సందీప్ భౌతిక కాయాన్ని సందర్శించిన మంత్రి శ్రీధర్ బాబు సిపి సుధీర్ బాబు

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- నక్సలైట్ల కాల్పుల్లో వీర మరణం పొందిన మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని ఘట్కేసర్ కు చెందిన రాచకొండ ఏఆర్ జవాన్ తిక్క సందీప్ భౌతిక కాయాన్ని రాష్ట్ర ఐటి, పరిశ్రమ, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల మంత్రి, జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో పాటు రాచకొండ సీపీ సుధీర్ బాబు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీ తో పాటు టిపిసీసీ ఉపాధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి తో కలిసి రాచకొండ ఏఆర్ జవాన్ తిక్క సందీప్ భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారు రాజిరెడ్డి భౌతికకాయాన్ని కూడా రాచకొండ సిపి సందర్శించి నివాళులు అర్పించారు.



## ఈనెల 22న కొత్తకోటలో బీసీ చైతన్య భారీ బహిరంగ సభ..

### బిసి చైతన్య సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ హనుమంతరావు,కోల జనార్ధన్

హైదరాబాద్ :మే 9:( వాయిస్ టూ డే) బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, అందుకు జనాభా దామాషా ప్రకారం పార్లమెంట్ లో బిసి బిల్లు ప్రవేశపెట్టి,చట్టబద్ధత కల్పించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోషల్ డెమోక్రటిక్ జేఏసీ జాతీయ చైర్మన్ కోల జనార్దన్ గౌడ్, రాష్ట్ర చైర్మన్, బి సి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.చెన్న రాములు ముదిరాజ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడ అభినందన హోటల్లో వివిధ బీసీ సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వి.హెచ్, జాతీయ ఎస్ డి జాక్ చైర్మన్ కోలా జనార్ధన్ గౌడ్ హాజరై ఈనెల 22న ఉమ్మడి మహబూబ్ నగర్ లోని కొత్తకోటలో వెనుకబడిన కులాల సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించే బి సి చైతన్య సదస్సు పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి.హెచ్ మాట్లాడుతూ 60 శాతం జనాభా ఉన్న బీసీలకు విద్యా, ఉద్యోగ రంగాలలో జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 ప్రకారం బీసీలకు చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాధికారం దిశగా బీసీలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చెన్న రాములు ముదిరాజ్, జాతీయ చైర్ పర్సన్ స్వరూప, సూర్యనారాయణ,రామన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## ఆంజనేయ వర్మ మరియు ఆవుల జగదీశ్ యాదవ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కోలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ మే 9(వాయిస్ టుడే): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆంజనేయ వర్మ, ఆవుల జగదీశ్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి ర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వదం తీసుకోవడం జరిగింది . అనంతరం హన్మంతన్న శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ ఎం సి అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కోలన్ జీవన్ రెడ్డి, రాజి రెడ్డి, మెడ శ్రీనివాస్ రావు, భాస్కర్, ధర్మేందర్ పాల్గొన్నారు .

## యాదాద్రి కొండపైన గాయత్రీ మహిళభజన మండలి

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి జయంతి సందర్భంగా 09/05/2025 శ్రీయాదగిరి లక్ష్మి నరసింహ స్వామి వారి జయంతి ఉత్సవాల సందర్భంగా దార్మిక సాహిత్య సంగీత సభలో శ్రీ గాయత్రి మహిళా భజన మండలి అధ్యక్షురాలు రచ్చ లక్ష్మీబాయి అధ్వర్యంలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి భజనలు చేయడం జరిగింది . సంగీత సభ నిర్వాహకులు ప్రశంసించి సన్మానం చేసి స్వామీ వారి ప్రసాదం అందించారు. దేవస్థానం అధికారులకు లక్ష్మీబాయి ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో రచ్చ హేమలత,బత్తిని వినోద,ఎక్కలదేవి నీరజ, ముదిగొండజ్యోతి, బబ్బూరి ధనలక్ష్మి, కోట సత్యవాణి, ఎక్కదేవి కవిత, కైరంకొండ రమాదేవి, దండే శశిరేఖ, భోనగిరి పద్మ,పుల్గం తులసీబాయి, తబలా వల్లకాటి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



వాయిస్ టుడే

హైదరాబాద్
శుక్రవారం, 9 మే 2025



## కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ORS పౌడర్ ప్యాకెట్స్ పంపిణీ

భద్రాచలం, మే 09 ( వాయిస్ టు డే): భద్రాచలం పట్టణ ట్రాఫిక్ స్టేషన్ లో శుక్రవారం ట్రాఫిక్ సిబ్బందికి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ORS ప్యాకెట్స్ పంపిణీ చేసారు. ఎండాకాలంలో వడగాలులు నుండి, దప్పిక నుండి రక్షణ కొరకు 30 లీటర్ల కు సరిపడా ORS పౌడర్ ప్యాకెట్స్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఔషధ తనిఖీ అధికారి సంపత్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పరిమి సోమశేఖర్, పాల్గొన్నారు. ఈ ORS ప్యాకెట్ల కు రత్న ఫార్మా నాగబాబు ఆర్థిక సహకారం అందించినట్లు పరిమి సోమశేఖర్ తెలిపారు.



## భద్రాచలం చెక్పోస్ట్ వద్ద 29.500 కేజీల గంజాయి పట్టివేత

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మే9: ఒరిస్సా మల్కాన్ గిరి జిల్లా నుంచి హైదరాబాద్ కు కారులో గంజాయిని తరలిస్తున్నట్లు అందుకున్న సమాచారం మేరకు భద్రాచలం ఎక్సైజ్ పోలీసులు చెక్పోస్ట్ వద్ద ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో అనుమానం వచ్చినటువంటి కారును నిలిపి లోపల పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు.గంజాయిని బయటకు తీసి తూకం వేయగా29.500 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు భద్రాచలం సిఐ రహీం ఉన్నిసా బేగం తెలిపారు.పట్టుకున్న గంజాయి విలువ రూ. 14 లక్షల 50 వేలు ఉంటుందని అంచనా వేశారు.ఈ కేసులో కడపకు చెందిన సాయి కృష్ణ, పవన్ రెడ్డి, హైదరాబాదుకు చెందిన శ్రీహరి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.గంజాయితో పాటు కారును కూడా సీజ్ చేసినట్లు సిఐ పేర్కొన్నారు. గంజాయిని పట్టుకున్న కేసులో అసిస్టెంట్ కమిషనర్ కరంచంద్ సీఐ రహీం మున్నీసా బేగం సిబ్బంది ఉన్నారు.గంజాయిని పట్టుకున్నటువంటి భద్రాచలం పోలీసులను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఎక్సైజ్ సూపరిండెంట్ జానయ్యలు అభినందించారు.



## దర్శావళి దర్గా ఉత్సవాలకు రండి

### – కేటీఆర్, అజ్మతుల్లా హుస్సేన్‌లకు ఆహ్వాన పత్రిక అందజేత

వాయిస్ టుడే ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల జిల్లా: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలో ఈనెల 14, 15న జరిగే దర్శావళి దర్గా ఉత్సవాలకు రావాలని మాజీ మంత్రి కేటీఆర్, రాష్ట్రవాక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనిని శుక్రవారం హైదరాబాదులో కలిసి ముస్లిం కమిటీ నాయకులు ఇన్విటేషన్ కార్డును ఇవ్వడం జరిగింది. మాజీ మంత్రి, సిరిసిల్ల నియోజకవర్గ శాసనసభ్యులు కేటీఆర్ తప్పకుండా 15వ తేదీన వస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా వాక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుసేని ఉత్సవాలకు హాజరవుతానని అన్నారు. ఇన్విటేషన్ కార్డులు ఇచ్చిన వారిలో దర్గా ఉర్సు ఉత్సవాల నిర్వాహకులు షేక్ అజీజ్, ముస్లిం కమిటీ మండల అధ్యక్షుడు షాదుల్లా, ముస్లిం కమిటీ నాయకులు చాంద్ పాషా, షేక్ సాహెబ్, షేక్ గౌస్, మహమ్మద్ జబ్బార్, సయ్యద్ జహంగీర్, మహమ్మద్ ఇర్ఫాన్, మహమ్మద్ గౌస్ లు పాల్గొన్నారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం గోపాలపురం గ్రామ అధ్యక్షుడి నియామకం

హుజూర్నగర్ మే 9 (వాయిస్ టుడే ప్రతినిధి) హుజూర్నగర్ మండలం గోపాలపురం గ్రామం బీసీ సంక్షేమ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన కాలువ వెంకటేశ్వర్లు గారిని నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ధూళిపాల శ్రీనివాస్ రావు హుజూర్నగర్ పట్టణంలోని బీసీ భవన్ లో శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘాన్ని గ్రామస్థాయిలో బలోపేతం చేసే కార్యక్రమాల భాగంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గ్రామాల్లో కమిటీ నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు ప్రభుత్వం నుంచి అందవలసిన వాటాను సాధించేందుకు బీసీలంతా ఏకతాటిపై నడవాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ ఉద్యమంలో యువత ప్రధాన పాత్ర పోషించాలని దానిలో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా బీసీ యువత కమిటీలు కూడా నిర్మాణం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు బొడ్డు గోవిందరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి రాయల వెంకటేశ్వర్లు, పట్టణ మహిళా అధ్యక్షురాలు గూడెపు దీప పట్టణ ఉపాధ్యక్షులు చేపూరి నరసింహ చారి, కర్నే కృష్ణ, ఓరుగంటి మధు, శెట్టి శ్రీనివాస్, క్రాంతి, బాలు పారేపల్లి నరసింహారావు, తంగిళ్ళపల్లి చారి, తదితరులు పాల్గొన్నారు.



# కనిపించే దైవం.. కనిపెంచే మాతృ మూర్తి అమ్మ

**బిడ్డల ఎదుగుదలే అమ్మకు వెలకట్టలేని సంతోషం..**

**నీలం మధు ముదిరాజ్**

**ఇస్నాపూర్‌లో ఘనంగా అంతర్జాతీయ మాతృదినోత్సవ వేడుకలు**

**అంగవైకల్య బిడ్డలకు సేవ చేస్తున్న మాతృమూర్తులను ఘనంగా సన్మానించిన నీలం**



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : సృష్టిలో తల్లి ప్రేమ ఎంతో గొప్పదని, మనకు కనిపించే దైవం మనను కని పెంచిన మాతృ మూర్తి అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. మే 12వ తేదీ అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని కండర క్షీణిత వ్యాధి బాధితుల సంఘం వ్యవస్థాపకులు యం రవికుమార్ గారి ఆధ్వర్యంలో గత పదహారు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఈ రోజు శుక్రవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రామాలయం ఆవరణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో మరచిపోలేని పాత్ర పోషించిన మన అమ్మకు ప్రత్యేకంగా గౌరవం ఇచ్చే రోజు అంతర్జాతీయ మాతృ దినోత్సవం అని అన్నారు. అమృతం ఉందో లేదో.. అది ఆయుష్షు పోస్తుందో లేదో తెలియదు కానీ.. "అమ్మ" మాత్రం తన ఆయుష్షును సైతం మనకే పోస్తుందన్నారు. బిడ్డలుగా మనం నిండు నూరేళ్లూ ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటుందని మన బంగారు భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తుందని, జీవితాంతం పిల్లలే తన సర్వస్వంగా భావించే అమ్మ ప్రేమను మించిన ప్రేమ ప్రపంచంలో మరొక్కటి లేదని కొనియాడారు. మనల్ని కనీ, పెంచీ, పెద్ద వాళ్లను చేసి మంచి భవిష్యత్తు ఇచ్చిన అమ్మకు ఏమిచ్చినా ఋణం తీర్చుకోలేమన్నారు. బిడ్డల ఆనందమే తనకు వెలకట్టలేని సంతోషంగా జీవితాంతం ఆమె సర్వస్వాన్ని బిడ్డల కోసం అర్పించే తల్లిని మించిన దైవం మరొకటి లేదని పునరుద్ఘాటించారు. నవ మాసాలు మోసి కని పెంచి మనల్ని ప్రయోజకుల్ని చేసిన అమ్మ ముఖంలో సంతోషం ఉండేలా చూసుకుంటే కొంతైనా అమ్మ రుణం తీరుతుందన్నారు. తన తల్లి తనకు నేర్పిన ఓనమాలు, మంచి పనులతోనే తాను జీవితంలో ఈ స్థాయికి ఎదిగానని వివరించారు. దురదృష్టం కొద్ది తన తల్లి తండ్రులను ఒక్క రోజు వ్యవధిలో కోల్పోయానని కంట తడి పెట్టారు.

మా అమ్మ ఇచ్చిన స్ఫూర్తితో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆడబిడ్డలలో నా మాతృ మూర్తిని చూసుకుంటున్నానన్నారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులని ఆయన అభినందించారు. కండర క్షీణిత వ్యాధి బాధితుల సంఘానికి ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాతృమూర్తులు, దివ్యాంగులు, సంగారెడ్డి DRDA APD జంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, టీచర్ శిరీష, మెట్టు శ్రీధర్, ఎన్ శ్రీనివాస్, వి నారాయణ రెడ్డి, మన్నే రాఘవేంద్ర, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆంక్షలు లేకుండా రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయాలి



రాయికల్(వాయిస్ టుడే) : ఆంక్షలు లేకుండా రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయాలని రాయికల్ బి. ఆర్ . ఏస్ మండల కోఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిరుపేద యువతకు స్వయం ఉపాధి పథకాలకు చేయూతనిచ్చే పథకాలను గతంలో మాదిరి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం లబ్ధిదారులను కుదించడానికి సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే అమలు చేయమని కొర్రీలు పెడుతుందని ఆరోపించారు.. 50% మంది లబ్ధిదారులకు పాన్ కార్డు లేవని, గతంలో లేని ఇబ్బందులు ఇప్పుడు ఎందుకు అన్నారు.. ప్రభుత్వం నిరుద్యోగుల చేయూత అందించేందుకు యువ వికాసం పథకాన్ని గతంలో మాదిరి అమలు చేయాలని కోరారు..



## భారత సైన్యానికి మద్దతుగా ప్రత్యేక పూజలు

రాయికల్(వాయిస్ టుడే): ఆపరేషన్ సిందూర్ లో ధైర్యంగా పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా రాయికల్ పట్టణంలోని నాగారం హనుమాన్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కశ్మీర్ లో పహల్గామ్ ఘటన తరువాత ప్రతి భారతీయునిలో ఆవేదనకు ప్రతీకారంగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ పైన భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించడం అనేది భారత్ శక్తి యుక్తులకు నిదర్శనమన్నారు.

భారత సైనిక దళాలు 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను విజయవంతంగా ధ్వంసం చేసిన నేపథ్యంలో వారికి భారతీయులు ప్రతి ఒక్కరు మద్దతు తెలుపాలన్నారు.ఇండియా – పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో భారత సైన్యానికి, భారత భూభాగానికి, దేశ ప్రజలకు ఎటువంటి నష్టం జరగకూడదని,ఈ యుద్ధంలో భారత్ ఘన విజయం సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, కాంగ్రెస్, బిజెపి,బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్,కుర్మ మల్లారెడ్డి,ఎలిగేటి అనిల్,లయన్స్ క్లబ్ అధ్యక్షులు మచ్చ శేఖర్, నాయకులు మచ్చ నారాయణ,గాజెంగి అశోక్, వాసం దిలీప్,చింతకుంట సాయికుమార్,బొమ్మకంటి నవీన్, సుమన్,భరత్,మహేష్,పవన్,అశోక్, రంజిత్ అర్చకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం వ్యాప్తి వద్దు




రాయికల్( వాయిస్ టుడే): మనిషి మనుగడ కోసం కనిపెట్టిన సాంకేతిక పరిజ్ఞానం మనిషినే బానిసగా చేసి ఆడుకుంటుంది అందులో సోషల్ మీడియా మద్యమం ఒకటి , ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ప్రభావితం చేసే సాధనం మనిషిని క్షణంలో స్పందింప జేసి భావ ప్రకటన స్వేచ్ఛను ప్రకటించే కారకం 'సోషల్ మీడియా '' కానీ దీనివల్ల సమాజానికి అవసరమైన సమాచారం కంటే తప్పుడు సమాచారం అధికంగా వ్యాప్తి చెందుతుంది ,దాంతో అనేకమంది జీవితాలు ప్రభావితమయ్యే అవకాశం ఆవశ్యకత ఉంది, అదే తప్పుడు సమాచారం అయితే ఎంతోమంది జీవితాలకు తప్పుడు మార్గంలో నడుస్తాయి కాబట్టి సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉంటూ పోస్టులు పెట్టేముందు ఆలోచించాలని రెచ్చగొట్టే అంశాలు దేశ సమగ్రతకు భంగం వాటిల్లేలా పోస్ట్ లు సోషల్ మీడియాలో పెట్టవద్దని పోలీసులు వార్నింగ్ ఇస్తున్నారు

తప్పుడు సమాచారం వ్యాప్తి ఇలా : ఇటీవల చూసిన అనేక అంశాలలో వేరే ప్రాంతానికి సంబంధించిన పాత చిత్రాలను వీడియో లను పెట్టీ తప్పుడు అంశాన్ని ప్రజల పై రుద్దడం సరికావని అంటున్నారు పాత వీడియో ల ద్వార ఈ సంఘటన ఇప్పుడే జరిగిందంటూ సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నారని అలాగే పాత కథనలను ఇప్పుడే జరిగినట్లు వ్యాప్తి చేస్తున్నారు ఓ యువతి గత కొన్ని సంవత్సరాల క్రితం ధృవికరణ పత్రాలు పోగొట్టుకుంది కానీ ఈ రోజే పోయినట్లు దొరికితే ఇవ్వండి అంటూ మళ్లీ సోషల్ మీడియాలో రి పోస్ట్ లు వస్తున్నాయి,ఓ యువకుడికి వాహన ప్రమాదం జరిగింది ఆర్థిక సహాయం చెయ్యండి అని పెట్టిన పోస్ట్ అనేక సంవత్సరాల తర్వాత వాట్స్ అప్ పేస్ బుక్ మాధ్యమాలలో వస్తున్నాయి రాజకీయలవి అయితే లెక్కే లేదు ఏది నిజమో అబద్ధమో తెలుసుకోవాలంటే పెద్ద పరీక్షే ,ఇట్లాంటి తప్పుడు ప్రచారాల వల్ల ప్రజలు అనేక మంది ప్రభావితం అవుతున్నారు కొన్ని ప్రస్తావించిన లేని అంశాల సమాచారం కూడ సోషల్ మీడియాలో బహిర్గతం అవుతున్నాయి

**రెచ్చగొట్టే సమాచారం చట్ట విరుద్ధం**

సోషల్ మీడియాలో వ్యక్తుల బహిరంగ పరచ తగని సమాచారం మరియు సామాజిక వర్గాలను,సంస్థల ప్రభుత్వ లు నాయకుల పైన , అదర రహిత ఆరోపణలతో ఇతరుల మనోభావాలకు భంగం కలిగించే అవకాశం ఉన్న వ్యాఖ్యలు రెచ్చ గొట్టే సమాచారం దేశ భద్రత,రక్షణకు సంబంధించి తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకో నే అవకాశం ఉన్నట్లు తెలిసింది,ప్రస్తుత పరిస్థితి లలో నిర్ధారణ లేని సమాచారం సామజిక మాధ్యమాలలో వ్యాప్తి తగదు

**సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉందాం**

సోషల్ మీడియాలో విస్తృతంగా తప్పుడు ప్రచారాలు సర్క్యులేట్ అవుతుంటాయి,కొన్ని సాధారణంగా ఉండేవి అయితే మరి కొన్ని దేశం కులం మతం జాతి లాంటి వైరుధ్యాలతో కూడుకున్న సున్నితమైన అంశాలు పోస్ట్ చేసే ముందు ప్రతి ఒక్కరూ ఇది వాస్తవ నిర్ధారణ చేసుకోవాలి సోషల్ మీడియాలో అందుబాటులో ఉన్న సమాచారం తో పాటు గూగుల్ లెన్స్ ను వాడి అట్టి సమాచారం నిజమా అబద్దమో తెలుసుకోవచ్చు ఖచ్చితంగా సర్క్యులేట్ చేస్తున్న అంశంపై అవగాహనతో ఉండాలి లేనియెడల అనేకమైన సామాజిక మరియు చట్టపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది దాంతో ఇప్పటివరకు అనేకమంది కేసుల పాలై కోర్ట్ లా చుట్టూ తిరుగుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి కాబట్టి ఆచి తూచి స్పందిస్తే అందరికి మంచిది.

# ఆరు గ్యారెంటీలు అమలులో ప్రభుత్వం విఫలం

**రాజకీయ జోక్యంతో అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు.**

**సిపిఎం ధర్నాలో భద్రాద్రి జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు**



భద్రాచలం, మే 09 (వాయిస్ టు డే): అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు విమర్శించారు. భద్రాచలం పట్టణ సమస్యలు పరిష్కరించాలని సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎండిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించి పార్టీ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులకు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగానే భద్రాచలం పట్టణంలో అన్ని వార్డులలో సర్వే నిర్వహించడం జరిగిందని వచ్చిన సమస్యలను ప్రజలను కదిలించి వారి సమక్షంలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న పద్ధతుల్లో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందడం లేదని,రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం చెందిందని అన్నారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో రాజకీయ జోక్యం కారణంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు రావడం లేదని అనర్హులకు ఇల్లు మంజూరు అవుతున్నాయని అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. సొంత స్థలం లేని పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు, ఫించన్లు కొత్తగా ఇవ్వలేదని, ప్రభుత్వం మారిన అదే పరిస్థితి కొనసాగుతోందని నేటికీ కొత్త రేషన్ కార్డులు పింఛన్లు మంజూరు కాకపోవటం దారుణమని అన్నారు. అనేకమంది పేదలకు ఫ్రీ కరెంటు, గ్యాస్ సబ్సిడీ అందడం లేదని అన్నారు.భద్రాచలం పట్టణం గోదావరి వరద ముంపుకు గురికాకుండా కరకట్ట ఎత్తు పెంచి పొడిగించి పటిష్ట పరచాలని అందుకు జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే,ఎంపీలు కృషి చేయాలని అన్నారు. సుభాష్ నగర్ శివారులో పొడిగిస్తున్న కరకట్ట పనులను సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో శివారు కాలనీల్లో కరెంటు స్తంభాలు లేక చీకటిలో మగ్గుతున్న పరిస్థితి ఉందని తక్షణమే కరెంటు స్తంభాలు వేయాలని అన్నారు. రామాలయం దగ్గరలో కరకట్టపై చెత్త డంపింగ్ యార్డ్ ను తక్షణమే పట్టణ శివారు ప్రాంతానికి తరలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి పట్టణ నాయకులు పి సంతోష్ కుమార్, డి సీతాలక్ష్మి, నాదెళ్ల లీలావతి, ఉస్తేల జ్యోతి, నకిరికంటి నాగరాజు, కుంజా శ్రీనివాస్, చుక్కా మాధవరావు, జీవనజ్యోతి, చాట్ల శ్రీనివాస్, ఎస్ భూపేంద్ర, కోరాడ శ్రీనివాస్, అజయ్ కుమార్, డి రాఘవయ్య, కొలగాని రమేష్, డి కనక శ్రీ పాల్గొన్నారు

## శరవేగంగా ట్యాంక్ బండ్ పనులు

### మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్



వాయిస్ టుడే తొర్రూర్ మే 9 : తొర్రూర్ మున్సిపల్ పరిధిలోని చెరువు దగ్గర ట్యాంక్ బండ్ పనులను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆదేశానుసారం శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ట్యాంక్ బండ్ పనులను పరిశీలించారు ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ మాట్లాడుతూ ట్యాంక్ బండ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్ను ఆదేశించారు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చొరవతో రూపాయలు ఐదు కోట్ల తో ట్యాంక్ బంద్ పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. ఎక్కడ కూడా రాజీ పడకుండా పనులలో నాణ్యత పాటించాలని ట్యాంక్ బండ్ పనులను సుందరీ కరణంగా తీర్చిదిద్దాలన్నారు. తొర్రూరు పట్టణాభివృద్ధిలో ట్యాంక్ బండ్ చిరస్థాయిగా నిలిచిపోతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రంజిత్ హెల్త్ అసిస్టెంట్ రాజు కాంట్రాక్టర్ చంద్రయ్య. తదితరులు పాల్గొన్నారు



## సంఘీ.ఎలేందర్ మాదిగకు దళిత రత్న అవార్డు ప్రధానం

వరంగల్ ( వాయిస్ టుడే )మే 09: శివనగర్ (వరంగల్ జిల్లా) కు చెందిన ప్రముఖ దళిత నేత సంఘీ ఎలేందర్ మాదిగకు ఈ ఏడాది గాను దళిత రత్న అవార్డు లభించింది. తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా నాయకుడిగా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు, దళితుల హక్కుల కోసం ఆయన నిబద్ధతను గుర్తించి అయన కు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

డా.బి.ఆర్ అంబేద్కర్ జయంతి మరియు బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా 2025లో షెడ్యూల్ కులాల వారితో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉత్సవాలలో, ఇటుక రాజు మాదిగ ని వర్కింగ్ చైర్మన్‌గా నియమించిన ఉత్సవాల కమిటీ, ఆ కార్యక్రమాల్లో ఎలేందర్ మాదిగ చేసిన సేవను గుర్తించి మాదిగ రాజకీయ పోరాట సమితి %వీ=ూా (౧%)వారు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో, సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిటు పాక ప్రభాకర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు బొక్కల వెంకటస్వామి మాదిగ చేతుల మీదుగా ఎలేందర్ మాదిగకు అవార్డు ప్రదానం జరిగింది. తదనంతరం దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను రవి మరియు ప్రజా సంఘాల నాయకులు సంఘీ ఎలేందర్ ను పూల భోకెలు శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఎలేందర్ మాదిగ మాట్లాడుతూ ఈ గౌరవం నాకు మరింత బాధ్యతను కల్పించింది. భవిష్యత్తులో కూడా దళితుల హక్కుల కోసం అంకితభావంతో పనిచేస్తానని అని తెలిపారు.

ఈ కార్యక్రమం లో బెజ్జంకి యాకంబ్ర చారి మరియు తెలంగాణ ప్రజా పరిరక్షణ సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జూపాక ప్రభాకర్ మరియు హనుమకొండ జిల్లా అధ్యక్షులు కుమ్మరి లక్ష్మీనారాయణ తెలంగాణ ప్రజా పరిరక్షణ సమితి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఠాకూర్ సునీత, దళిత హక్కుల పోరాట సమితి ఖిలా వరంగల్ మండల ప్రధాన కార్యదర్శి రాచర్ల రాజేందర్, వరంగల్ మండల ప్రధాన కార్యదర్శి జన్ను శంకర్,హరిబాబు,మరియు మంద నవీన్, వేల్పుగొండ నర్సింగరావు,అరేపల్లి కుమార్, పోలేపాక రాజన్ బాబు, గ్యార మల్లయ్య, గుమ్మడి రమేష్, మేడిపల్లి లక్ష్మణ్, చింతకింది జానకమ్మ పాల్గొన్నారు

## పశువులు రోడ్లపై సంచరిస్తే గోశాలకు తరలిస్తాం

### మున్సిపల్ కమిషనర్ జి రాజు, ఎస్ఐ జి రాజశేఖర్



రామకృష్ణాపూర్ మే 9 (వాయిస్ టుడే): క్యాతనపల్లి మున్సిపాలిటీ పురవీధులలో ఇష్టానుసారంగా పశువుల యజమానులు విచ్చలవిడిగా ఆవులను,గేదెలను రోడ్లపైకి వదిలేయడం వలన వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, 48 గంటలలోపు పశువుల యజమానులు పశువులను తమ ఇంటి ఆవరణలో ఉంచుకోవాలని ,లేనిచో మున్సిపల్ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గోశాలకు తరలించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జి రాజు, పట్టణ ఎస్ఐ జి రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. పట్టణంలో యదేచ్ఛగా పశువులను వదిలేయడం వలన విచ్చలవిడిగా పురవీధులలో సంచరించడం వలన ప్రజలకు, వాహనదారులకు ప్రమాదం జరిగి గాయాల పాలవుతున్నారని తెలిపారు.



## జవాన్ వీర మరణం..!

### పరామర్శించి నివాళులర్పించిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, రాచకొండ సిపి సుధీర్ బాబు, కలెక్టర్ గౌతం పొట్రూ.

వాయిస్ టుడే న్యూస్, మే 09 మేడిపల్లి : ఘట్కేసర్ కి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ దళిత బిడ్డ తిక్క సందీప్, చత్తీస్ గడ్ నక్సలైట్లు పేల్చిన మందు పాత్రకు బలై వీరమరణం పొందిన సందర్భంగా శుక్రవారం రోజు వారికి నివాళులు అర్పించిన తెలంగాణ రాష్ట్ర IT శాఖ మంత్రి వర్యులు శ్రీధర్ బాబు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాచకొండ సీపీ సుదీర్ బాబు, జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రూ, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఏమ్మెల్యే సుదీర్ రెడ్డి, SC కార్పొరేషన్ చైర్మన్ ప్రితం, మాజీ ZP చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి, ACP చక్రపాణి, మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, B బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, మండల అధ్యక్షుడు కర్రె రాజేష్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, మున్సిపాలిటీ అధ్యక్షులు ముత్యాలు యాదవ్ పాల్గోని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ములుగు జిల్లా లంక పల్లి అటవీ ప్రాంతంలో నిన్న ఉదయం కుంబింగ్ నిర్వహిస్తున్న సమయం లో మావోయిస్టులు పెల్చిన ల్యాండ్ మైన్ పెలి తిక్క సందీప్ చనిపోవడం చాలా బాధాకరం అని వారి ఆత్మ కి శాంతి కలగాలని ఆ బాగావంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి అన్నివిధాలా ప్రభుత్వం ద్వారా అందించే సహాయసహాకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, రెవిన్యూ అధికారులు, జిల్లా ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు కార్యకర్తలు, యువజన సంఘాల నాయకులు, ప్రజలు, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాధితులకు అండగా ఉంటా

### జాతీయ ఎస్టీ కమిషన్ జాటోత్ హుస్సేన్ నాయక్

**ఢిల్లీలో ఎస్టీ కమిషన్ ముందు హాజరైన**
**పిర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు శ్రీలత బద్రు నాయక్**



వాయిస్ టుడే న్యూస్, మే 09 మేడిపల్లి : శుక్రవారం న్యూఢిల్లీలోని లోక్ నాయక్ భవన్ లో మేడిపల్లిలోని సర్వేనెంబర్ 62/1 బాపూజీ నగర్ బాధితుల పట్టాల సమస్యపై ఫిర్యాదు విచారణకు జాతీయ ఎస్టీ కమిషన్ ముందు హాజరవడం జరిగింది. ఈ విచారణ సందర్భంగా ఎస్టి కమిషన్ ముందు బాధితులు ఎదుర్కొంటున్న పట్టాల సమస్య గురించి, కబ్జాదారుల దోపిడి గురించి వివరణ ఇవ్వడం జరిగింది. దాంతో కమిషన్ స్పందించి మేడిపల్లి లోని 62/1 సర్వేలో గల బాధితులకు న్యాయం చేస్తామని విచారణ సందర్భంగా తెలపడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీలత భద్రు నాయక్ మాట్లాడుతూ, ఎస్టి కమిషన్ జాటోత్ హుస్సేన్ నాయక్ ముందు హాజరై బాధితులు మోసపోయిన వైనాన్ని వివరంగా కమిషన్ ముందు క్షుణంగా వివరించామని కమిషన్ న్యాయం చేస్తానని తెలిపిందని,ఎన్ని ఒత్తిడి మాపై వచ్చిన గాని ధైర్యంతో ప్రజా సమస్యలపై కొట్లాడుతూనే ఉంటామని శ్రీలత బద్రు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషన్ ముందు హాజరైన తర్వాత ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు, లంబాడి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ అశోక్ నాయక్ మాట్లాడుతూ, పట్టాల గురించే కాకుండా అమాయక ప్రజలను భయభ్రాంతులను గురిచేస్తున్న భూ మాఫియా లను కఠినంగా శిక్షించేంతవరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

## ప్రమాదవశాస్తూ బావిలో పడి ఇద్దరు వ్యక్తులు మృతి

హుజూర్ నగర్ మే 9 (వాయిస్ టుడే ప్రతినిధి) : హుజూర్ నగర్ పట్టణ ఎస్ఐ జి.ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన కన్మనూర్ తిరుపతయ్య, మేదిపురం లక్ష్మణ్ (21 సం.రాలు) లు మరో ఆరుగురు వ్యక్తులతో కలిసి వారి స్వగ్రామం నుండి గొర్రెలను మేపుకుంటు హుజూర్ నగర్ పట్టణానికి వచ్చినారు. గత పది రోజుల నుండి హుజూర్ నగర్ పట్టణానికి చెందిన జక్కుల లింగయ్య పొలం లో మేత కోసం గొర్రెలను ఆపి అట్టి పొలంలోనే ఉంటున్నారు. సుమారు నాలుగు రోజుల క్రితం తిరుపతయ్య ఇద్దరు కుమారులు శేఖర్ (14 సం.రాలు), చరణ్ లు వేసవి సెలవులు అయినందున తండ్రి వద్దకు వచ్చినారు. శుక్రవారం రోజు ఉదయం 08-15 గంటల సమయంలో తిరుపతయ్య పెద్ద కుమారుడు శేఖర్, లక్ష్మణ్ లు సమీపంలో గల లింగయ్య బావిలో నీళ్ళకోసం వెళ్ళి, లక్ష్మణ్ నీళ్ళు పట్టడానికి ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాస్తూ కాలు జారీ బావి లో పడి మునుగుచుండగా, శేఖర్ అతన్ని కాపాడడానికి ప్రయత్నించగా అతను కూడా బావి లో పడి ఇద్దరు నీట మునిగి చనిపోయినరని శేఖర్ తండ్రి తిరుపతయ్య ఇచ్చిన పిర్యాధు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారన్నారు



## కెటిఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన బాలయోగి

( భద్రాచలం, మే 09 ) : భద్రాచలం పట్టణానికి చెందిన విద్యావేత్త, సీనియర్ జర్నలిస్ట్ తోటమల్ల బాలయోగి శుక్రవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయన తోపాటు భద్రాచలం లోని పలు రంగాలకు చెందిన పలువురు బి ఆర్ ఎస్ కార్యనిర్వహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు సమక్షం లో గులాబీ కండువా కప్పుకున్నారు. బాలయోగి తో పాటు అతని మిత్రులు కుంచాల సదానందం, బచ్చు శ్రీనివాస్, శ్రీ రంగం భార్గవ్, కొనకల్ల వేణుగోపాల్, న్యాయవాదులు రామ హంస, మల్ల సత్యనారాయణ లతో పాటు మొత్తం 20 మంది సత్తుపల్లి నియోజకవర్గం మిట్టపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత రావులపల్లి రాంప్రసాద్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో వీరు పార్టీలో చేరారు. గులాబీ కండువా కప్పి వారిని కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మేధావి వర్గం పార్టీలో చేరటం చాలా సంతోషంగా ఉందని, రానున్నది టిఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ పురోగతికి ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని సూచించారు. భద్రాచలంలో ఉప ఎన్నికలు రావడం తథ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, టిఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, బిఆర్ఎస్ భద్రాచలం డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ, మండల కన్వీనర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.



## 27న జరిగే మహాసభను విజయవంతం చేయాలి

వాయిస్ టుడే తొర్రూరు మే 9: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న హైదరాబాదులో తలపెట్టిన ఆటో ఆకలికేకల మహాసభను ఆటో కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ పిలుపునిచ్చారు.ఈ మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ తొర్రూరు మండలంలోని లోకల్ ఆటోలతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయామని, ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకానికి ప్రత్యామ్నాయంగా ఏడాదికి ఆటో కార్మికునికి 12 వేలు ఇస్తానని చెప్పి ప్రభుత్వం మాట మార్చిందన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ టౌన్ అధ్యక్షుడు మంగళపల్లి ప్రసాద్, గొల్లపల్లి నరేష్, గుండాల రంజిత్,సదానందం మంగళపల్లి ప్రతాప్, మల్లేష్,యాకన్న,వెంకన్న, మల్లేష్,యాకయ్య, కుమార్. భద్రయ్య,రాజు, రామ్మూర్తి, వెంకటేష్, ఉపేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి అరెస్టు అప్రజాస్వామికం

### ఖండించిన తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (టిఎస్ జేయు) వరంగల్ జిల్లా కమిటీ



వరంగల్ ( వాయిస్ టుడే ) మే 09 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రత్తిపాడు నియోజకవర్గం సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (టిఎస్ జేయు) వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందికొండ మోహన్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఫోర్ట్ రోడ్డులో టిఎస్ జేయు బాధ్యుల సమావేశంలో అయన మాట్లాడుతూ సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి అరెస్టును టిఎస్ జేయు యూనియన్ పక్షాన ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ వ్యతిరేక వార్తలు రాసినందుకు సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటికి ఏపీ పోలీసులు వెళ్లి భయానక వాతావరణాన్ని సృష్టించి అరెస్టు చేశారన్నారు. పోలీసుల తీరుకు ఆయన కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారన్నారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఆయన్ని పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ ఈ తరహాలో అరెస్టులు చేయడం సరికాదన్నారు. తక్షణమే ధనుంజయరెడ్డిని వెంటనే విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ నాయకులు ఆవునూరి కుమారస్వామి, కందికొండ గంగరాజు, ఈద శ్రీనాథ్, లింగబత్తిని కృష్ణ, బత్తుల సత్యం, నాగపూరి అవినాష్, కౌడగని మోహన్ రావు, నీరుటి శ్రీహరి, అశోక్, భాగ్యరాజు, సురేష్, కమల్, యూనియన్ రాష్ట్ర నాయకులు తోకల అనిల్, రావుల నరేష్, నాగపురి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బేతస్త బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో వి బి ఎస్ కార్యక్రమం

### -ర్యాలీలో పాల్గొన్న సండేస్ స్కూల్ పిల్లలు




వరంగల్ ( వాయిస్ టుడే ) మే 09 : నగరం లోని వెంకట్రామా జంక్షన్ లోని బేతస్థ బాప్టిస్ట్ చర్చ్ వరంగల్ సంఘం స్టాడింగ్ కమిటీ ఆధ్వర్యంలో సండేస్ స్కూల్ పిల్లలు, %ఎదీూ% కార్యక్రమంలో భాగంగా చర్చి కీ సంబందించిన సండేస్ స్కూల్ పిల్లలచే %ఎదీూ% ర్యాలీ ని స్థానిక కాపరి రెవరెండ్ డాక్టర్. పి కరుణ్ శ్రవణ్ దేవుని నామం ఘనపరుస్తూ ప్రార్థనతో ర్యాలీని ప్రారంభించరు. ఈ ర్యాలీలో సండేస్ స్కూల్ సూపర్డెంట్ కొమ్ము టీనా, సండేస్ స్కూల్ డైరెక్టర్ కొమ్ము సోని అపర్ణ సారథ్యంలో పిల్లల చే ర్యాలీ నీ నిర్వహించారు.ఈ యొక్క కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు కొమ్ము రాజు, కార్యదర్శి పోలేపాక ప్రసాద్, కోశాధికారి పోలేపాక సీతయ్య, అలాగే టీచర్స్ కొమ్ము సురేష్, కొమ్ము నిస్స, పెద్దలు టీచర్స్ మరియు వాలంటీర్స్ పిల్లలు సంఘస్తులు పాల్గొని ర్యాలీని జయప్రదం చేసినారు.

# చైతన్యపరిచిన మాజీ సైనికుల మాక్ డ్రిల్

**యుద్ధం వచ్చినప్పుడు ముందస్తు పౌర రక్షణపై అవగాహన పెంచిన సన్నివేశాలు.**

**పర్యవేక్షించిన మాజీ సైనిక ఉద్యోగి ఎస్ ఎం అరుణ్.**



ఖమ్మం ,మే9, ( వాయిస్ టుడే ): ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో యుద్ధం వచ్చినప్పుడు పౌరులు తీసుకోవలసిన ముందు జాగ్రత్తలను వివరిస్తూ శుక్రవారం స్థానిక ఎన్ ఎస్ సి కాలనీ హై స్కూల్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో మాజీ సైనికులు నిర్వహించిన సన్నివేశాలు అందరినీ చైతన్య పరిచాయి. మాజీ సైనిక ఉద్యోగుల ఇండియన్ వెటర్న్ ఆర్గనైజేషన్ అధికార ప్రతినిధి ఎస్ఎం అరుణ్ పర్యవేక్షణలో నిర్వహించిన యుద్ధ ముందస్తు పౌర రక్షణ విన్యాసాలు అందరినీ అబ్బురపరిచి అవగాహన పెంచాయి. శత్రువులు బాంబులు వేసి భవనాలకు మంటలు అంటుకున్నప్పుడు పౌరులు ధైర్యంగా ఉండి ఆ మంటలనుంచి బయటపడే సన్నివేశాన్ని ఎస్ఎం అరుణ్ రూపొందించి ప్రదర్శించారు. మంటల్లోంచి బయటపడి గాయాలతో ఉన్నవారికి ప్రథమ చికిత్స చేసే విధానాన్ని వివరించారు. బాంబు దాడులు జరిగినప్పుడు, విపరీతంగా గాయపడినప్పుడు వెనువెంటనే ప్రథమ చికిత్స చేసే విధానాన్ని తెలియజేశారు. యుద్ధం సంభవించినప్పుడు రాత్రిపూట నగరాల ఉనికి, గ్రామాల ఉనికి శత్రువులకు తెలియకుండా రాత్రిపూట అందరూ విద్యుత్ను పూర్తిగా ఆపు చేసి ఎమర్జెన్సీ బ్లాక్ అవుట్ నిర్వహించాలని చైతన్యం కలిగించారు. నీళ్లలో పడినప్పుడు, వరదలు సంభవించినప్పుడు మన ఇంట్లో ఉన్న వస్తువులతో ముందస్తుగా ఎమర్జెన్సీ లైఫ్ జాకెట్ లను తయారు చేసుకునే విధానాన్ని మాజీ సైనికులు తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రెండు గంటలపాటు మాజీ సైనికులు, సైనికులు, ఎన్సిసి క్యాడెట్లు ఈ మాక్ డ్రిల్ ను నిర్వహించారు. వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన 150 మంది ఎన్సిసి క్యాడెట్లు, యువతి యువకులు, 20 మంది ఆర్మీ జవాన్లు, 50 మంది మాజీ సైనిక ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు, అడ్వకేట్లు, వివిధ పాఠశాలల, కళాశాలల కరస్పాండెంట్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి సుబేదార్ మేజర్ బహదూర్, జిల్లా ఫైర్ ఆఫీసర్ అజయ్ కుమార్, ఆర్పిఎఫ్ సిఐ , మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ప్రతినిధులు , విద్యార్థి సంఘాల నాయకుడు వెంకటేష్, యువ అడ్వకేట్ నాళ్ల భానుచందర్, తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు సత్వరమే పూర్తి చేయాలి

**నున్నా నాగేశ్వరరావు**

ఖమ్మం , మే 9 ( వాయిస్ టుడే): ఫాసిజం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. శుక్రవారం ఖమ్మం సుందరయ్య భవన్ లో కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సిపిఎం జిల్లా కమిటీ సమావేశంలో సుదర్శన్‌రావు మాట్లాడుతూ ఫాసిజం సామ్రాజ్యవాద ధోరణులకు వ్యతిరేకంగా, శ్రామిక వర్గ పోరాటాలను ఉధృతం చేయాలని కోరారు. హిట్లర్ ఫాసిజాన్ని 1945 మే 9 సోవియట్ యూనియన్ ఎర్రసైన్యం ఓడిరచింది అని అన్నారు. ఫాసిజం మానవాళికి అత్యంత ప్రమాదకరం అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు సత్వరమే పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్ కి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పూర్తి చేయకుండానే ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు పరిధిలో గోదావరి జలాలు అందించామని మంత్రులు ప్రచారం చేస్తున్నారని, సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు మరో 19 వేల కోట్ల రూపాయల మేరకు అవసరం అని ప్రభుత్వం ప్రకటించి బడ్జెట్లో కేవలం ఆరు వందల కోట్ల రూపాయలు కేటాయించారని అన్నారు. ఖమ్మం జిల్లాలో రుణమాఫీ నలభై శాతం రైతులకు చేయలేదన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన ధాన్యం, పండ్ల తోటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఏలాంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించాలని కోరారు. మే 19న దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని కోరారు.

## 4 నెలల్లో యాతాలకుంట టన్నెల్ పూర్తి చేయాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



సత్తుపల్లి , మే 09 ( వాయిస్ టుడే ) సీతారామ ఎత్తిపోతల పథకం యాతాలకుంట టన్నెల్ పనులు 4 నెలల్లో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సత్తుపల్లి మండలం యాతాలకుంటలో సీతారామ ప్రాజెక్టు క్రింద నిర్మిస్తున్న యాతలకుంట టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి. పాటిల్ లు, అశ్వారావుపేట, సత్తుపల్లి ఎమ్మెల్యే లు జారె ఆదినారాయణ, మట్టా రాగమయి లతో కలిసి, సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా మెయిన్ కెనాల్, 3 పంప్ హౌస్ లు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకున్నామని, రాజీవ్ లింక్ కెనాల్ ఏర్పాటు చేసుకొని రాబోయే వానాకాలం దుమ్ముగూడెం ఆనకట్టకు గోదావరి నీరు రాగానే వైరా ప్రాజెక్టుకు, పినపాక నియోజకవర్గం తుమ్మలపల్లి వద్ద మారేడుపాక ఎత్తిపోతల పథకం ప్రారంభించి 25 వేల ఎకరాల ఆయకట్టు, కొత్తగూడెం నియోజకవర్గంలో యూటిలు ఏర్పాటు చేసుకొని అన్ని చెరువులకు నీళ్ళు వదిలేటట్లు ఏర్పాటు చేయాలని అన్నారు.

సత్తుపల్లి ట్రంక్ టన్నెల్ 1.8 కిలోమీటర్లకు గాను 1.2 కిలో మీటర్లు పూర్తయిందని, పెండింగ్ ఉన్న 600 మీటర్ల పనులు 4 నెలల్లో పూర్తి చేయాలని, అవసరమైతే మరో నిచ్చెన పెట్టుకోవాలని, అప్పటి లోపు అవసరమైన అక్వాడెట్ లు, ఇతర నిర్మాణాలు పూర్తి చేయాలని అన్నారు. శాసనసభ్యులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన భూ సేకరణ చేపట్టాలని అన్నారు.

వానాకాలం పంట సమయంలో గోదావరి జలాలు రైతులకు ఉపయోగపడాలని, ప్రభుత్వం రాజీవ్ కెనాల్, యాతాలకుంటపై చేసిన ఖర్చు సద్వినియోగం కావాలని అన్నారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలు సస్యశ్యామలం కావాలనే ఆకాంక్షతో ఈ ప్రాజెక్టు చేపట్టామని, దీనిని పూర్తి చేయాలని అన్నారు.

సత్తుపల్లి, పినపాక, మధిర, వైరా, అశ్వారావుపేట నియోజకవర్గాలకు ఈ సంవత్సరమే సాగునీరు అందాలని అన్నారు. వైరా ప్రాజెక్టు క్రింద లక్ష 30 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని అన్నారు. నాగార్జునసాగర్ నీళ్లు రాకపోయినా రైతులకు ఇక ఇబ్బంది ఉండదని అన్నారు. సీతారామ ప్రధాన కాలువ శుభ్రం చేయాలని, నీరు వదిలితే త్వరగా వైరా ప్రాజెక్టులోకి నీళ్లు వెళ్లేలా చూసుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి సమస్యలు వచ్చిన కలెక్టర్ దృష్టికి తీసుకొని పోవాలని అన్నారు. ప్రతి సమస్య వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, అటవీ అభ్యంతరాలు, భూసేకరణ, లీగల్ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇర్రిగేషన్ సిఇ ఏ. శ్రీనివాస రెడ్డి, ఎస్ఇ ఎస్. శ్రీనివాస రెడ్డి, ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాసా చారి, ఎస్డీసి ఎం. రాజేశ్వరి, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**త్వరలో అక్రెడిటేషన్లు, ప్రొఫెషనల్ కమిటీల ఏర్పాటు: మంత్రి పొంగులేటి హామీ**

ఖమ్మం ,మే 9 ( వాయిస్ టుడే): జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఒక్కొక్కటిగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం నాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే. విరాహత్ అలీ, కే. రాంనారాయణల నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం మంత్రి శ్రీనివాస్ రెడ్డితో సచివాలయంలోని ఆయన ఛాంబర్ లో సమావేశమై జర్నలిస్టుల వివిధ సమస్యలపై చర్చించింది. ఎన్నికల సమయంలో, కాంగ్రెస్ మేనిఫెస్టోలో జర్నలిస్టుల సంక్షేమాన్ని పొందుపర్చడంతో జర్నలిస్టులు ఎంతో హర్షించారని, అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా ఇంకా ఏ ఒక్క సమస్యకు పరిష్కారం దక్కకపోవడంతో జర్నలిస్టుల్లో నిరాశ చోటుచేసుకుందని విరాహత్, రాంనారాయణలు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రెడిటేషన్ల నియమావళి రూపకల్పనా కోసం ప్రభుత్వం కమిటీ వేసిందని, ఆ కమిటీ నివేదిక సమర్పించి నెల రోజులు గడుస్తున్నా ఇంకా జీవో జారీ కాలేదన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన అక్రెడిటేషన్లను ఏడాదిన్నర కాలంగా జర్నలిస్టులు రెన్యూవల్ చేసుకుంటున్న పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే కొత్త అక్రెడిటేషన్లు జారీ చేసేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు వ్యతిరేకంగా ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కేవలం అర్బన్ ప్రాంతాల్లో సొసైటీల వరకే వర్తిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు కాదని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వర్తించేందుకు గాను వారికి రక్షణ కల్పించేందుకు, సామాజిక సేవలో నిమగ్నమైన జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు అనేక జీవో లు జారీ చేసి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాయని, గత పదేళ్లుగా వాటిని నిర్వీర్యం చేసారని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులపై దాడుల నిరోధక హైపవర్ కమిటీ, వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ కమిటీ, వేజ్ బోర్డు సిఫారసులను పర్యవేక్షించే త్రైపాక్షిక కమిటీని ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. చిన్న, మధ్యతరగతి పత్రికల బిల్లులు పెండింగులో ఉండడం, అప్ గ్రేడేషన్ ప్రక్రియ జరగక పోవడంతో వాటి నిర్వాహకులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం మునగనూరు గ్రామ శివారులో ఎల్.బి.నగర్ జర్నలిస్టులకు ఏడాదిన్నర క్రితం ఇంటి స్థలాలు కేటాయించగా వారు ఇండ్లను సైతం నిర్మించుకున్నారని, అయితే ఆ స్థలాలను ఖాళీ చేయాలని గత కొన్ని రోజుల నుండి రెవెన్యూ అధికారులు లబ్దిదారులను మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారని, వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వారు మంత్రిని కోరారు. టీయూడబ్ల్యూజే విన్నవించిన ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీనివాస్ రెడ్డి, త్వరలోనే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు కే. శ్రీకాంత్ రెడ్డి, జి. మధు గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, రాష్ట్ర నాయకులు మాతంగి దాస్, హెచ్.యూ.జే అధ్యక్షులు శిగా శంకర్ గౌడ్ లు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



ముదిగొండ మండలం మే 9 వాయిస్ టుడే : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లాపురం గ్రామానికి చెందిన పాపినేని వెంకటేశ్వర్లు అనారోగ్య సమస్యలతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా అట్టి(60,000) రూపాయల విలువగల చెక్కును మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తాటికొండ రమేష్ మరియు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాలి చిన్న నరసింహారావు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క కి కృతజ్ఞతలు తెలిపారు..ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు తాటికొండ విజయ, మల్లికార్జున స్వామి దేవాలయ చైర్మన్ గాలి గోపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తన్నీరు వెంకటేశ్వర్లు, గువ్వలగుంటి రాంబాబు,యంద్రపల్లి వెంకటేశ్వర్లు ఎన్నిడి అంజయ్య, షేక్ వజీర్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు యడ్లపల్లి పద్మ పాల్గొన్నారు.

## ఇందూరులో సినీనటి పూనమ్‌కౌర్



నిజామాబాద్: ప్రముఖ సినీనటి పూనమ్ కౌర్ జిల్లా కేంద్రం నాందేవ్‌వాడ బ్రహ్మకుమారీ కేంద్రంలో శుక్రవారం జరిగిన ధ్యాన శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొంటున్న సైనికులకు దేవుడు మరింత శక్తినివ్వాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ధ్యాన సాధనతో మానసిక వికాసం లభిస్తుందన్నారు. ఆమెను కేంద్రం వ్యవస్థాపకులు సునీత సత్కరించారు.



## జర్నలిస్టు సహాయనిధి చెక్కు అందజేత

వాయిస్ టుడే తొర్రూర్ మే 9 : అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్టుకు ఆర్థిక సహాయంగా రాష్ట్ర మీడియా అకాడమీ నుంచి రూ. లక్ష చెక్కు అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం హైదరాబాదులో అందజేశారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే హెచ్ 143 మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి సిరికొండ విక్రమ్ కుమార్ మాట్లాడుతూ బోగోజు సురేష్ మృతి చెందడం బాధాకరమని ఆయన కుటుంబానికి అండగా ఉండాలని సహాయనిధి అందే వరకు తమ వంతుగా కృషి చేశామని వెల్లడించారు. తోటి జర్నలిస్ట మిత్రులకి అండగా ఉండాలని ఉద్దేశంతో అందుకు అవసరమయ్యే విధి విధానాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని సహాయనిది వచ్చేంతవరకు కృషి చేశామని భవిష్యత్తులో ఏ జర్నలిస్ట్ కుటుంబానికైనా అండగా ఉంటూ ఇదే విధంగా సహకరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్దవంగర మండల ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు బోగోజు భద్రయ్య చారి, పలువురు పాత్రికేయులు, అకాడమీ సభ్యులు హాజరయ్యారు.




## వేసవి శిక్షణా తరగతులను పర్యవేక్షించిన రాష్ట్ర విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ రాజీవ్

వాయిస్ టుడే తొర్రూర్ మే 9 : తొర్రూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెర్లపాలెం నందు విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల నిర్వహణ తీరును ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులలో దాగి ఉన్న అంతర్గత కోశాలాలను వెలికి తీసి నైపుణ్యాలను పెంపొందించడం కోసమే వేసవి శిక్షణ తరగతులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు

సమ్మర్ క్యాంపులో కార్యక్రమాలతో పాటు ఇతర కొత్త కార్యక్రమాలు కూడా నిర్వహించడం జరుగుతుంది. కావున ఐదవ తరగతి నుండి పదో తరగతి చదువుతున్న ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవలసిందిగా పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ (సమగ్ర శిక్ష) రాజీవ్ తెలియజేసారు . ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులను రాష్ట్ర విద్యాశాఖ జెండర్ కోఆర్డినేటర్ శిరీష, స్టేట్ అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీ వెంకటస్వామి,జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రవీందర్ రెడ్డి, మండల విద్యా శాఖాధికారి మహంకాళి బుచ్చయ్య పాల్గొన్నారు.పాఠశాల ఉపాధ్యాయులు , స్వర్ణలత, మల్లయ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## కవి సమ్మేళనంలో పరమేశ్వర్ ప్రతిభ

పెద్దవంగర, (వాయిస్ టుడే) మే 10: అంతర్జాతీయ కవి సమ్మేళనంలో పరమేశ్వర్ ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నాడు. మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శింగా విధులు నిర్వహిస్తున్న బిర్రు పరమేశ్వర్ గురువారం హైదరాబాద్ లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాష చైతన్య సమితి, లక్ష్య సాధన ఫౌండేషన్ల 12 వార్షికోత్సవ వేడుకలు చేపట్టారు. ఈ మేరకు తెలుగుబాష సదస్సు పేరిట అంతర్జాతీయ కవి సమ్మేళనం నిర్వహించగా పరమేశ్వర్ కవితా గానం చేశాడు. సామాజిక అంశాలపై ఆయన చేసిన గానానికి అతిథులు కవి సాహితీవేత్త ఏనుగు నర్సింహరెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ బాలకృష్ణ రెడ్డి, వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తంరెడ్డి ప్రశంసా పత్రం అందజేసి, ఘనంగా సన్మాంచారు.

## మాట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో జాగృతి పోలీస్ కళాబృందం ప్రదర్శన.

వరంగల్ ( వాయిస్ టుడే ) మే 09 : నగర పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జాగృతి పోలీస్ కళాబృందం వారిచే శుక్రవారం రాత్రి 7:10 గంటల నుంచి 9:10 గంటల వరకు మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగంపేట్ కాలనీ లో పోలీస్ కళా బృందం వారిచే యువకులు గంజాయి డ్రగ్స్,గుట్కా మత్తు పదార్థాల బారిన పడవద్దని,గంజాయి అమ్మిన సేవించిన 8712584473 మొబైల్ నెంబరుకు సమాచారమందించాలని కాలనీవాసులకు అవగాహన కల్పిస్తూ,చదువు, రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, డయల్100, సీసీటీవీ కెమెరాలు, ముసలి తల్లితండ్రులను మంచిగ చూసుకోవాలని, మూఢ నమ్మకాలపై మ్యాజిక్ షో, అలాగే తదితర సామాజిక అంశాలపై పాటల ద్వార స్థానికుల కు వివరిస్తూ, మరియు సైబర్ క్రైమ్స్, బెట్టింగ్ ఆప్స్ పై నాటిక ప్రదర్శన చేస్తూ 1930 సైబర్ హెల్ప్ లైన్ నంబర్ గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మట్వాడ సి ఐ గోపి ,ఎస్ ఐ లక్ష్మయ్య ఏ ఎస్ ఐ సదయ్య కానిస్టేబుల్స్ ఆఫీసర్స్, కళాబృందం సభ్యులు,హెడ్ కానిస్టేబుల్ లు విలియమ్, వెంకటేశ్వర్లు,రత్నయ్య, కానిస్టేబుల్ లు ఫూల్ సింగ్ ,హెూమ్ గార్డ్స్ , శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజు, చిరంజీవి మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

